క్లుప్తంగా

సీఎం జగన్‌కు సాదర స్వాగతం



జి-20 సదస్సు కోసం విశాఖ విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. విశాఖ ఎయిర్‌పోర్టులో సీఎంకు స్వాగతం పలికారు.

వైభవంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం



విశేష పూజలందుకున్న లక్ష్మీగణపతి

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు కేఎస్ఎన్ రెడ్డి నగర్ (ఉప్పరకాలనీ)లోని లక్ష్మీ గణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకాల అనంతరం నూతన వస్త్రాలు సమర్పించి, పుష్పాలంకరణ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు గుర్రాల సూర అప్పారావు, నక్కా ఈశ్వరరావు, కె.రాజు, లక్ష్మణరావు, కె.వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అగనంపూడి: లంకెలపాలెం సమీపంలోని పెద ముషిడివాడ 33 కేవీ పరిధిలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు. ఈ పరిధిలో విద్యుత్ స్తంభాలు, తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో 85వ వార్డు మంత్రిపాలెం, మడకపాలెం, లంకెలపాలెం, గెంజిపేట, శ్రీరామ్‌నగర్ కాలనీ, వినాయక నగర్, గంగిరెడ్ల కాలనీ, గొల్లపేట, ఐ.మర్రిపాలెం, గొన్నవానిపాలెం, ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీలు, పరవాడ మండల పరిధిలోని పెదముషిడివాడ, గండివానిపాలెం, నక్కవానిపాలెం, పచ్చికోరవానిపాలెం, కస్నూరు, మడకపాలెం గ్రామాల్లో అంతరాయం ఉంటుందని తెలియజేశారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధి వియ్యపువానిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. చిన్నారుల హాజరు శాతాన్ని పరిశీలించారు. చిన్నారులకు మంచి ఆహారాన్ని అందజేయాలని అంగన్‌వాడీ టీచర్ రోజారమణికి సూచించారు.

బీజేపీ గాజువాక కన్వీనర్‌గా నర్సింగరావు

గాజువాక: బీజేపీ గాజువాక కన్వీనర్‌గా కరణం రెడ్డి నర్సింగరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు నుంచి మంగళవారం ఉత్తర్వులు అందినట్టు ఆయన తెలిపారు. తనను గుర్తించి మరోసారి కన్వీనర్‌గా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

జోరుగా ఆస్తి పన్ను వసూళ్లు

- వడ్డీ మినహాయింపుతో పెరిగిన వసూళ్లు
- రోజుకు రూ. కోటికి పైమాటే..
- మొండి బకాయిలకు కలిగిన మోక్షం
- మరో మూడు రోజులే గడువు



సౌకర్యం కౌంటర్‌వద్ద పన్ను చెల్లింపుదారులు



జెడ్సీకి పన్ను వసూలు చెక్కులను అందజేస్తున్న రెవెన్యూ బృందం

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్‌లో ఆస్తి పన్నుల వసూలు ఊపందుకొంది. ఆస్తి పన్ను బకాయిలపై ప్రభుత్వం వడ్డీ మినహాయింపునివ్వడంతో పన్ను చెల్లింపుదారులు తమ పాతబకాయిలను సైతం చెల్లిస్తున్నారు. ప్రతి అసెస్‌మెంట్ దారునికి వడ్డీ మినహాయింపు విషయాన్ని తెలిపిన జోనల్ రెవెన్యూ అధికారులు పన్ను వసూలుపై కూడా దృష్టి సారించిన విషయం తెలిసిందే. ఆర్వోలు రామనారాయణ, శ్రీకాంత్ నేతృత్వంలో ముగ్గురు ఆర్ఐలతో బృందాలను ఏర్పాటు చేశారు. ఆటోలు, ప్రచార రథాలు, వలంటీర్ల సహకారంతో ప్రతి ఇంటికీ వెళ్లి పన్ను చెల్లించాల్సిన అవసరాన్ని రెవెన్యూ బృందాలు వివరిస్తుండటంతో పన్ను వసూళ్లు ఆశాజనకంగా ఉన్నాయి.

ఈ నేపథ్యంలో రోజుకు కోటిన్నర రూపాయల వరకు పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్న రెవెన్యూ విభాగం సిబ్బంది రోజుకు కోటి రూపాయలకు పైగానే వసూలు చేస్తున్నారు. ఇదే క్రమంలో మొండి బకాయిలు కూడా వసూలవుతుండటంతో అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గాజువాకలోని 1.18లక్షల అసెస్‌మెంట్ల నుంచి మొత్తం రూ. 69 కోట్ల ఆస్తి పన్ను వసూలు కావాల్సి ఉంది. ఈ మొత్తంలో ఇప్పటివరకు రూ.58 కోట్లు వసూలైనట్టు అధికారులు తెలిపారు. మరో రూ.11 కోట్లు మేర వసూలు కావాల్సి ఉంది. మొండి బకాయిలు మరో రూ.15 కోట్లు వసూలు కావాల్సి ఉండగా వడ్డీ మినహాయింపుతో సగానికి పైగా వసూలైనట్టు సిబ్బంది పేర్కొన్నారు.

వడ్డీ మినహాయింపును వినియోగించుకోవాలి

ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మినహాయింపు సౌకర్యాన్ని జోన్‌లో పన్ను చెల్లింపుదారులందరూ వినియోగించుకోవాలి. ఈ అవకాశం మరో మూడు రోజులే ఉంటుంది. సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి.

-పి.సింహాచలం, గాజువాక జోనల్ కమిషనర్

ఘనంగా వైఎస్సార్‌టీయూసీ వ్యవస్థాపక దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



వేడుకల్లో పాల్గొన్న యూనియన్ నాయకులు

పెదగంట్యాడ: కార్మికుల సంక్షేమమే వైఎస్సార్ టీయూసీ లక్ష్యమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. వైఎస్సార్ టీయూసీ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పెదగంట్యాడ జంక్షన్‌లో కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పిట్టా రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. స్టీల్‌ప్లాంట్‌లో యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్‌లోని అన్ని డిపార్ట్‌మెంట్లలో కమిటీలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, నాయకులు మార్టుపూడి పరదేశి, గొందేశి వెంకటరమణారెడ్డి, అండిబోయిన అప్పారావు, కూటికుప్పల జనార్దన్, బోశాడ అప్పారావు, గొందేశి అప్పలరెడ్డి, ములకలపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో..

ఉక్కునగరం: వైఎస్సార్‌టీయూసీ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో ఉక్కునగరం కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో మొదటిసారి ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి దాదాపు 900 ఓట్లు సాధించింది వైఎస్సార్‌టీయూసీ మాత్రమే అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కర్రి దాలినాయుడు, మార్టుపూడి పరదేశి, ఎన్నేటి రమణ, జి.రమణారెడ్డి, జి.అప్పలరెడ్డి, డి.అప్పలరాజు, బి.రామకృష్ణ, పిట్టా రెడ్డి, చిత్రాడ రమణ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.05 కోట్లకు ఆశీలు వేలం



కాంట్రాక్టర్‌కు ఆశీలు ఉత్తర్వులను అందజేస్తున్న జెడ్సీ సింహాచలం

గాజువాక: 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను గాజువాకలోని మార్కెట్ ఆశీలు వసూలు కాంట్రాక్టును రూ.1,05,50,000కు నూకాంబికా ఎంటర్‌ప్రైజెస్ దక్కించుకుంది. దీనికోసం జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో మంగళవారం బహిరంగ వేలంపాట నిర్వహించారు. గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం సమక్షంలో కనీస పాటను రూ.95 లక్షలతో ప్రారంభించారు. మొత్తం ఏడుగురు పాటదారులు పాల్గొనగా నూకాంబికా ఎంటర్‌ప్రైజెస్ యజమాని బొండా సూరిబాబు ఈ కాంట్రాక్టును దక్కించుకున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కూడా ఆశీలు వసూలును ఇదే కాంట్రాక్టరు నిర్వహిస్తున్నారు. గతేడాది నిర్వహించిన వేలం పాటలో ఈ కాంట్రాక్టును రూ.1,04,75000ను దక్కించుకున్నారు. గతేడాదికంటే ఈసారి రూ.75వేలు పెరిగినట్టు జోనల్ కమిషనర్ తెలిపారు. వేలంపాట నిర్వహణలో జోనల్ సూపరింటెండెంట్ కె.రమణ, సిబ్బంది చంద్రశేఖర్‌రెడ్డి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలి'



ధర్నాలో మాట్లాడుతున్న రామస్వామి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు వై.టి. దాస్ డిమాండ్ చేశారు. నూతన వేతనాలు అమలు చేయాలని, బీఎఫ్‌లో ఉత్పత్తి తక్షణం ప్రారంభించాలని, నూరు శాతం వ్యూహాత్మక అమ్మకాన్ని తక్షణం ఆపాలన్న డిమాండ్లపై స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా దాస్ మాట్లాడుతూ ప్లాంట్ మనుగడ, ఉత్పత్తులు, ప్రభుత్వ యాజమాన్యాల నిర్ణయాలపై రాజకీయ కుయుక్తులతో కూడిన ఆదేశాలు వస్తున్నాయన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ బీఎఫ్-3లో ఉత్పత్తి నిలుపుదల చేస్తే అప్పటి గుర్తింపు సంఘంగా ఉన్న సీఐటీయూ మిత్రపక్షాల ఆధ్వర్యంలో ప్రభుత్వానికి, యాజమాన్యానికి బీఎఫ్‌ను పునరుద్ధరించాలని లేఖల ద్వారా తెలియజేశామన్నారు. నేడు ఉత్పత్తి చేయలేక, ముడి సరకు కోసం ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ)కు ఆహ్వానం పలుకుతోందన్నారు. మిత్రపక్షాల నాయకులు డి.వి. రమణారెడ్డి, కర్రా ప్రకాశరావు, సీఐటీయూ నాయకులు పి. శ్రీనివాసరాజు, గంగాధర్, బి. అప్పారావు, టి.వి.కె. రాజు, నీలకంఠం, యు. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయంతో కార్మికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఐక్య ఉద్యమాలతో పరిశ్రమను పరిరక్షించుకుంటామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 775వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణ కుట్రలో భాగంగా యాజమాన్యం ఉత్పత్తికి కావలసిన ముడి సరకులను సమకూర్చడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రోజుకో విభాగంలో ఉత్పత్తిని నిలిపివేస్తూ, కొన్ని విభాగాలను ప్రైవేటు వారికి కట్టబెట్టాలని ప్రయత్నం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. సొంత గనులు లేకపోయినా వేల కోట్లు లాభాలను చేకూర్చడమే కాక, ఎన్నో కష్టాలను అధిగమించి అంకితభావంతో ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచితే, నేడున్న యాజమాన్యాలు తిరోగమన దిశగా ఉత్పత్తిని తగ్గించుకుంటూ సంస్థను నష్టాల బారిన పడేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన తీరును మార్చుకుని స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి 68వ వార్డులో 'గడపగడపకు మన ప్రభుత్వం'

అక్కిరెడ్డిపాలెం: గాజువాక నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఈ నెల 29వ తేదీన మళ్లీ ప్రారంభం కానుంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొద్ది రోజుల విరామం అనంతరం ఎమ్మెల్యే నాగిరెడ్డి కార్యక్రమంలో పాల్గొననున్నారు. జీవీఎంసీ 68వ వార్డు మింది సచివాలయ పరిధిలో బుధవారం నుంచి రెండు రోజుల పాటు కార్యక్రమం ఉంటుందని ఆ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష తెలిపారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కార్యక్రమానికి హాజరై, ప్రభుత్వ పథకాల అమలు తీరు, ప్రజల సమస్యల గురించి నేరుగా తెలుసుకుంటారని తెలియజేశారు.

వాటర్ సప్లై ఏఈల బదిలీ

గాజువాక: జీవీఎంసీ వాటర్ సప్లై విభాగంలో పలువురు ఏఈలు బదిలీ అయ్యారు. అందులో భాగంగా గాజువాక 10ఎంజీడీ, అగనంపూడి 85 ఎంఎల్డీ, సిద్ధార్థనగర్ 12 ఎంఎల్డీ నీటి సరఫరా ప్రాజెక్టులకు సహాయ ఇంజినీర్ (ఏఈ)గా పని చేస్తున్న రాజ్‌కుమార్‌ను ప్రాజెక్ట్స్ విభాగానికి బదిలీ చేశారు. ఆయన ప్రాజెక్ట్స్‌తో పాటు అగనంపూడి 85 ఎంఎల్డీ వాటర్ సప్లై బాధ్యతలను కూడా నిర్వహిస్తారు. గాజువాక, సిద్ధార్థనగర్ నీటి సరఫరా ఏఈగా కేదార్‌నాథ్‌ను నియమించారు. ఆయన ఈ నెల 31న బాధ్యతలు స్వీకరించనున్నారు. గాజువాక వన్ ఎంజీడీ నీటి సరఫరా ఏఈగా ప్రస్తుతం పని చేస్తున్న మనోహర్ కొనసాగుతారని జీవీఎంసీ వర్గాలు తెలిపాయి.

రాగిజావ పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోన్న రాగిజావ పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి 11 గంటల మధ్య (ఇంటర్వెల్ సమయంలో) విద్యార్థులకు రాగిజావ ఇచ్చేలా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. జిల్లాలోని 587 పాఠశాలల్లో అమలు చేస్తుండగా, 87,861 మంది విద్యార్థులు దీని ద్వారా లబ్ధి పొందుతున్నారు.

ఓల్డేజ్ హోమ్‌కు మరిడిమాంబ చీరలు



మందిరం ఆవరణలో చీరలు లెక్కిస్తున్న దృశ్యం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ ఆలయానికి భక్తులు కానుకగా సమర్పించిన చీరలను ఆలయ నిర్వాహకులు నగరంలోని పలు వృద్ధాశ్రమాలకు తరలించి,అక్కడ వృద్ధులకు అందజేశారు. సామాజిక సేవా కార్యకర్త డెల్లూరి భాస్కరరావు ఆధ్వర్యంలో మరిడిమాంబ ఆలయ నిర్వాహకులు మోదు అచ్యుతరావు,మోదు ఎల్లాజీరావు,కదిరి దుర్గారావు,నాగల సతీష్ తదితరులు ఏడాది పాటు అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను ఒక చోట ఉంచారు. గతంలో ఈ చీరలను భక్తులకు అందజేసేవారు. కానీ ఇప్పుడు వారు కొత్త ఆలోచన చేశారు. వృద్ధాశ్రమాలకు అందజేసి ఉదారత చాటుకున్నారు. సుమారు 2 వేల చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మల్కాపురం జాలర కుల సంఘం ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు అవస్థలు



పశువుల కళేబరాలతో దుర్గంధభరితంగా మారిన కైలాసభూమి

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డులో కై లాసభూమి దుర్గంధభరితంగా మారింది. 79, 85 వార్డుల్లోని అగనంపూడి పరిసర పది నిర్వాసిత కాలనీలకు ఇదే శ్మశానవాటిక. ఇక్కడ వసతులు లేకపోవడంతో పాటు శుభ్రత కూడా లోపించిందని మృతుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వార్డులోని చెత్తంతా ఇక్కడే కనిపిస్తోందన్నారు. అగనంపూడి, పరిసర ప్రాంతాల్లో మృతి చెందిన పశువుల మృత కళేబరాలను శ్మశానం ఆవరణలో డంప్ చేస్తుండడంతో, దుర్గంధం భరించలేకపోతున్నామని చెప్పారు. దీనిపై స్థానిక ప్రజా సంఘాల నాయకులు మంగళవారం జీవీఎంసీ అధికారులను కలిసి, శ్మశాన వాటికను పరిశుభ్రం చేయాలని వినతిపత్రం అందించారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

అనకాపల్లి డీఈవో వెంకటలక్ష్మమ్మ



విద్యార్థులకు రాగి మాల్ట్ అందిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అగనంపూడి: పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సూచించారు. పరవాడ మండలంలోని పెదముషిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. పాఠశాలలో జగనన్న గోరుముద్దలో భాగంగా అందిస్తున్న రాగి మాల్ట్‌ను విద్యార్థులకు అందించి, రుచిపై ఆరా తీశారు. బైజూస్ యాప్ ద్వారా ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందుతున్న పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. పరీక్షలు అయ్యేవరకు టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, ప్రణాళికాయుతంగా చదువుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణారావు, ఉపాధ్యాయులు పెద్దినాయుడు, కోటేశ్వరరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విధినిర్వహణలో అప్రమత్తత అవసరం



భద్రతా ప్రతిజ్ఞ చేస్తున్న స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులు, ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో జాతీయ ఉక్కు భద్రతా దినోత్సవం (స్టీల్ సేఫ్టీ డే)ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద జరిగిన కార్యక్రమంలో సీజీఎం (వర్క్స్) బి.కె. మొహంతి ముఖ్య అతిథిగా హాజరై, భద్రతా జెండాను ఎగురవేశారు. హాజరైన వారితో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు భద్రతతో విధులు నిర్వహించడం ద్వారా ప్రమాదరహిత పరిశ్రమగా స్టీల్ ప్లాంట్‌ను తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో సీజీఎంలు సారంగి, యు. శ్రీధర్, సిహెచ్. శ్రీనివాస్, ఎన్.వి. స్వామి, సోబ్తీ, పలువురు జీఎంలు, వివిధ కార్మిక సంఘాలు, అసోసియేషన్ల నాయకులు, సెంట్రల్ సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో వైద్య సేవల సమాచారంపై శిక్షణ



యాప్‌ను వినియోగించే విధానాన్ని వివరిస్తున్న గణాంకాధికారి

గాజువాక: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ద్వారా అందిస్తున్న వైద్య సేవల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసుకోవడం ద్వారా లభించే ప్రయోజనాలపై గాజువాక పీహెచ్‌సీ ఏఎన్‌ఎంలకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి సంబంధించిన యాప్‌ను సిబ్బంది మొబైల్ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేయించి ఉపయోగించే పద్ధతులను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ గణాంకాధికారి కె.మురళీకృష్ణ వివరించారు. ఏఎన్‌ఎంలు క్షేత్రస్థాయిలో తల్లీబిడ్డల సంరక్షణ, టీకాలు, వ్యాధుల నివారణకు అందిస్తున్న సేవల సమాచారాన్ని యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. దీనివల్ల తదుపరి ఫాలోఅప్‌నకు సంబంధించిన షెడ్యూల్‌ను యాప్ ద్వారా తిరిగి పొందుతామని వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వై.రామకృష్ణ, సీహెచ్‌వో పి.నాగ అప్పారావు, పీహెచ్‌సీ పరిధిలోని వివిధ ప్రాంతాల ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

గాజువాక: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, ప్రభుత్వరంగ సంస్థల సర్వీసుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు గాజువాక సీఐటీయూ ఆధ్వర్యంలో కార్యక్రమ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డి.రమణ, ఎ.లోకేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలను ఆపాలని, కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించడంతో పాటు కనీస పెన్షన్‌ను రూ.10 వేలు అమలు చేయాలన్నారు. ఈ డిమాండ్లపై నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమంతో దేశ రాజధాని దద్దరిల్లుతుందన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో నాయకులు గొలగాని అప్పారావు, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఆలయ కమిటీలో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలి'



రామాలయం వద్ద ఆందోళన చేస్తున్న బీసీ, ఎస్సీ నాయకులు

పెదగంట్యాడ: నెల్లిముక్కు గ్రామ దేవత పెంటమాంబ ఆలయ కమిటీలో బీసీ, ఎస్సీలకు కూడా ప్రాతినిధ్యం కల్పించాలని ఆయా వర్గాలకు చెందిన వారు డిమాండ్ చేశారు. నెల్లిముక్కు రామాలయం వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఐదేళ్ల నుంచి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు మాత్రమే కమిటీలో ఉంటున్నారని, ఆలయం వారికి చెందిందేనంటూ ప్రచారం చేస్తున్నారని అన్నారు. కోశాధికారితో పాటు ఐదుగురు డైరెక్టర్లను రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారినే నియమించారని ఆరోపించారు. ఆలయానికి చెందిన ఆస్తులకు కూడా వారే వారసులని చెప్పుకుంటున్నారన్నారు. నెల్లిముక్కు పంచాయతీకి చెందిన బీసీ, ఎస్సీ సామాజికవర్గాలకు చెందిన వారిని డైరెక్టర్లుగా నియమించాలని, లేకుంటే వచ్చే నెల 10న నిర్వహించనున్న అమ్మవారి పండగ మహోత్సవంలో పాల్గొనబోమని స్పష్టం చేశారు. సమావేశంలో నామాల పెంటయ్య, దొమ్మేటి అప్పారావు, ఎల్లేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్ ఆసక్తి వ్యక్తీకరణ ఉపసంహరించాలి'

ఉక్కునగరం: ముడి సరకు కోసం స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) ప్రకటనను ఉపసంహరించాలని కేంద్ర ఉక్కుశాఖ సహాయమంత్రి ఫగ్గాన్ సింగ్ కులస్తేను ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. న్యూఢిల్లీలో ఆయన్ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. బ్లాస్ట్‌ఫర్నేస్–3లో ఉత్పత్తి పునరుద్ధరించడానికి విడుదల చేసిన ఈవోఐ ప్రభుత్వరంగ సంస్థ మనుగడకు ముప్పు అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థగా సొంత నిధులతో చేయాల్సిన ఉత్పత్తిని ఈ విధమైన ఈవోఐగా చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె. అయోధ్యరామ్, కె.ఎస్.ఎన్. రావు, వై. మస్తానప్ప, వరసాల శ్రీనివాసరావు, జి. గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతి

స్టీల్‌ప్లాంట్ సమస్యలను పరిష్కరించాలని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు కేంద్ర ఉక్కుశాఖ సహాయమంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తేను కోరారు. అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బయ్యే మల్లయ్య, అధ్యక్షుడు బి. తౌడన్న నేతృత్వంలో న్యూఢిల్లీలో మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు పుల్లారావు, ఎస్. మోహన్‌బాబు, డి.సువర్ణరత్నం తదితరులున్నారు.